క్లుప్తంగా

విద్యార్థులకు నీతికథల బోధన



వేసవి విజ్ఞాన తరగతుల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. మరో నాలుగు రోజుల్లో శిబిరం ముగుస్తుండగా, ప్రతి రోజూ శిక్షణా శిబిరానికి హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గలేదని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు. సోమవారం పిల్లలకు నీతికథలు చెప్పారు. అలాగే పిల్లలతో అనుభవజ్ఞులైన తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు జి.సత్యవతి పిల్లలకు బహుమతులు అందించారు.

వ్యాసరచన పోటీలు



భీమవరంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీచర్ జి.గంగాధర్ పర్యవేక్షణలో ఈ పోటీల్లో ఏర్పాటుచేశారు. విద్యార్థులకు గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో క్యారమ్స్, చెస్‌లో, డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి.సోమరాజు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర పోస్టుమాస్టర్‌గా నాగేంద్రకుమార్



శ్యామ్ సూర్యప్రకాష్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేంద్రకుమార్

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్ర పోస్టుమాస్టర్‌గా బీజేఎస్ నాగేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్.శ్యామ్‌సూర్యప్రకాష్ పెరవలి పోస్టుమాస్టర్‌గా బదిలీకావడంతో ఆచంటలో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పేద విద్యార్థినికి సైకిల్ అందజేత



పేద విద్యార్థినికి సైకిల్ అందజేసిన వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బీవీఆర్ఎం బాలికల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గీతా భవాని అనే పేద విద్యార్థినికి సోమవారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.7వేలు విలువైన కొత్త సైకిల్‌ను అందజేశారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా క్షీరపురి యోగా సత్సంగం సభ్యుల సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు విరాళంతో ఈ సైకిల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, యోగా కేంద్ర నిర్వాహకుడు జవ్వాజి కల్యాణ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, మానెం బసవరాజు, తెలుగు ఉపాధ్యాయిని భిక్షాపతి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

యలమంచిలి: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎస్సై కాకి శివనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెక్షన్లు అమలులో ఉన్న సమయంలో నలుగురికి మించి ఒకచోట గుమికూడరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, బైక్ ర్యాలీలు చేయడం, మోటార్ సైకిల్ సైలెన్సర్ తీసి నడపడం వంటివి చేయకూడదన్నారు. అలాగే ఎన్నికల్లో ఓడిన వారిని కించపరిచే విధంగా లేదా వారి మనోభావాలు దెబ్బతీసేలా అభ్యంతరకర పోస్టులను సోషల్ మీడియాలో పెట్టరాదన్నారు. ప్రజలలు, ముఖ్యంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా యువత ఎలక్షన్ కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

తీరిన సాగునీటి వెతలు

- ప్రభుత్వ నిధులు, రైతుల విరాళాలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- గొంతేరు డ్రెయిన్ నుంచి ఎత్తిపోతలతో సమృద్ధిగా సాగునీరు
- రాపాక చానల్ నుంచి శివదేవుని చిక్కాలలో 500 ఎకరాలకు నీరు
- దాళ్వాలో అధిక దిగుబడులపై ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు



శివదేవునిచిక్కాలలో గొంతేరు డ్రెయిన్ గట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



గొంతేరు డ్రెయిన్ నుంచి నీరు తోడేందుకు ఏర్పాటు చేసిన మోటార్ పైపులు



గొంతేరు డ్రెయిన్ నుంచి రాపాక చానెల్‌లోకి ప్రవహిస్తున్న సాగునీరు

పాలకొల్లు అర్బన్: ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను స్వచ్ఛంద సంస్థలు, అధికారుల చొరవతో, విరాళాలతో రైతులు పరిష్కరించుకున్నారు. ఫలితంగా తమ పంటపొలాలకు సాగునీరు పుష్కలంగా అంది దాళ్వాలో అధిక దిగుబడులు సాధించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాపాక చానల్ శివారున ఆనుకుని ఉన్న శివదేవుని చిక్కాల వ్యవసాయ భూముల్లో ప్రతి ఎకరానికి సాగునీటి ఎద్దడిని రైతులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సార్వా, దాళ్వా పంట చివరలో చిరుపొట్ట దశలో సాగునీటి ఎద్దడి ఏర్పడేది. దీంతో వరిదుబ్బు నుంచి వెన్ను సరిగ్గా రాక, అలాగే వెన్ను పాలు పోసుకోక పంట తెలిపోయేది. వరి దుబ్బు వెన్నులో చివర తప్పలుగా తేలిపోయి పొల్లు కాయలుగా మారేవి. పంట దిగుబడి ఆశించిన మేరకు రాక రైతులు నష్టపోయేవారు. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి రైతులు ఈ ఏడాది జనవరిలో శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంతరామారావు ద్వారా అప్పటి కలెక్టర్ కె.ప్రశాంతిని సంప్రదించారు. గొంతేరు డ్రెయిన్ గట్టుపై ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని కోరారు. దీంతో కలెక్టర్ స్పందించి రూ.3.70 లక్షల వ్యయంతో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. శ్రీరాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే రూ.1,58,500 కలెక్టర్ మంజూరు చేశారు. మిగిలిన రూ.1.12 లక్షలను రైతులు విరాళంగా ఇచ్చారు. దీంతో విద్యుత్‌శాఖ ఏఈ తన సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేశారు. శివదేవునిచిక్కాల పంచాయతీ పరిధిలోని సానివాడలో గొంతేరు డ్రెయిన్ గట్టున పైపు నంబర్ 153 వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మూడు 7.5 సామర్థ్యం గల మోటార్లు ఏర్పాటు చేశారు. దీంతో గొంతేరు డ్రెయిన్‌లో నుంచి సానివాడ 153 నంబర్ పైపు ద్వారా రాపాక ఛానెల్‌లోకి నీటిని ఎత్తిపోయడంతో శివదేవుని చిక్కాల రైతులకు సాగునీరు సమృద్ధిగా అందింది. అలాగే దీనికి సంబంధించి విద్యుత్ బిల్లు రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు.

దాళ్వా పంటకు సమృద్ధిగా నీరు

25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వలన శివదేవుని చిక్కాల రైతులకు దాళ్వా పంటలో 500 ఎకరాలకు గొంతేరు డ్రెయిన్ నుంచి రాపాక ఛానెల్ ద్వారా చివరి రెండు తడులకు సమృద్ధిగా సాగునీరు అందింది. దీంతో పంట దిగుబడి ఎకరానికి 48 బస్తాల నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు ఆనందంగా చెబుతున్నారు.

కౌలు రైతులకు మేలు జరిగింది



గతంలో దాళ్వా పంటకు వంతుల వారీ విధానం అమలు చేసినా శివారు భూములకు సక్రమంగా సాగునీరు అందేదికాదు. ప్రస్తుతం గొంతేరు డ్రెయిన్ నుంచి రాపాక చానెల్‌లోకి సాగునీటిని ఆయిల్ ఇంజన్‌ల ద్వారా తోడుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో కౌలు రైతులకు మేలు చేకూరింది. దాళ్వా పంటలో సాగునీరు సక్రమంగా అందడం వలన పంట దిగుబడి అధికంగా వచ్చింది. రైతులకు మేలు జరిగింది. రైతుల కష్టాలు గట్టెక్కాయి.

– తండా ఇస్సాక్‌రాజు, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

అధికారులకు కృతజ్ఞతలు



నాకు సొంతంగా రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే మరో 50 ఎకరాలు కౌలుకు చేస్తాను. ప్రతి దాళ్వా పంటకు సాగునీరు అందక నష్టపోయేవాడిని. కలెక్టర్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారుల చొరవతో సమస్య తీరింది. అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– తాళ్లూరి శ్రీనివాస్, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే



ఈదా రాజు, వైఎస్సార్ సీపీ కువైట్ కోర్ కమిటీ సభ్యుడు

నరసాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రభంజనం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ కువైట్ కోర్ కమిటీ సభ్యుడు ఈదా రాజు అన్నారు. పచ్చ మీడియా పక్షపాత సర్వేలను పటాపంచలను చేస్తూ మంగళవారం తీర్పు రాబోతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంతో ఉండాలని కోరారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతుగా నిలిచారన్నారు. కూటమి నేతలు పెట్టుకున్న భ్రమలు తొలగిపోతున్నాయన్నారు. సంపూర్ణ మెజార్టీతో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పీఠంపై కూర్చోబోతున్నారన్నారు. మరో ఐదేళ్ల జగన్ జనరంజక పాలన సాగుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని చెప్పారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని పలువురు వ్యాపారులు, మధ్యతరగతి వారు కూడా ఫలానా పార్టీ గెలుస్తుందంటూ అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా రావడంతో పందెం రాయుళ్లలో అలజడి నెలకొంది. మంగళవారం ఓట్ల లెక్కింపు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భీమవరం వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకున్న వారిని మంగళవారం ఉదయం 5 గంటలకు భీమవరంలోని పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి



శేరేపాలెంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

మొగల్తూరు: మండలంలోని లబ్ధిదారు లకు పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో 3,265 మందికి లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 1వ తేదీ శనివారం సుమారు 1,725 మందికి, సోమవారం 1,540 మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో వి.బాబ్జిరాజు చెప్పారు. అలాగే 7,534 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాకు పింఛను సొమ్ము జమచేయాల్సి ఉండగా, సోమవారం నాటికి 7,525 మందికి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు బ్యాంక్‌ల ద్వారా ఏమైనా సమస్యలుంటే పింఛను వారి ఖాతాలో ఇప్పటికీ జమకాకుంటే వాటిని పరిష్కరించి పింఛను సొమ్ము వారి ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

97.37 శాతం పింఛన్ల పంపిణీ

నరసాపురం: నరసాపురం మునిసిపాలిటీలో జూన్ నెలకు సంబంధించి 97.37 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. మున్సిపాలిటీలో మొత్తం 1,519 మంది ఫించన్‌దారులు ఉండగా సోమవారం నాటికి 1,479 మందికి పంపిణీ చేశామన్నారు. ఇంకా కేవలం 40 మందికి మాత్రమే పెండింగ్ ఉందని చెప్పారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం




మొగల్తూరులోని స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మొగల్తూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికే పాఠ్యపుస్తకాలు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగానే మండలంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 46,150 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా, మొదటివిడతగా ఇప్పటివరకు 27,585 పుస్తకాలు వచ్చాయని ఎంఈవో శామ్యూల్ జాన్ సోమవారం తెలిపారు. వచ్చిన పుస్తకాలను మొగల్తూరులోని పెన్మత్సరంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ తరలించారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలో రానున్నాయని, పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ముందుగానే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తామని, అలాగే బ్యాగ్‌లు 4,843, డిక్షనరీలు 879 రావాల్సి ఉండగా, బెల్ట్‌లు మాత్రం 3,272 వచ్చాయన్నారు.

నత్తారామేశ్వరంలో రుద్రరూపంలో రామలింగేశ్వరుడు

పెనుమంట్ర: వైశాఖ మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని నత్తారామేశ్వరం గ్రామంలోని రామేశ్వరుని దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈనెల 6న పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వర స్వామి తిరిగి జలదిగ్బంధం కానుండటంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయానికి చేరుకున్న భక్తులు క్యూలైన్లలో నిల్చుని త్రిలింగ క్షేత్రాన్ని నత్తారామేశ్వరంలోని సీతారామ ప్రతిష్ఠ, లక్ష్మణ ప్రతిష్ఠ, పరశురామ ప్రతిష్ఠ చేసిన స్వామివార్లను ఒకే చోట దర్శించుకుని ఆలయ ఆవరణలో దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రసాదాన్ని స్వీకరించారు. నెల రోజుల పాటు దర్శనమిచ్చే గోస్తనీ నదిలోని శ్రీరామలింగేశ్వరుని దర్శనం ఈనెల 6వ తేదీతో ముగియనుండటంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారు. 6న మాస శివరాత్రి కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడ అభిషేకాలు చేయించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నదిలోని పరశురామ ప్రతిష్ఠను గంధంతో స్వామివారిని రుద్ర రూపంగా అలంకరించడంతో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



నత్తారామేశ్వరంలో పరశురామ ప్రతిష్ఠిత లింగ నిజరూప దర్శనం



ప్రత్యేక అలంకరణలో రుద్రరూపంలో పరశురామ ప్రతిష్ఠిత రామలింగేశ్వరస్వామి



నత్తారామేశ్వరంలో గోస్తనీ గర్భంలో రామేశ్వరస్వామి దేవాలయం



నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కీలకంగా చినమామిడిపల్లి బైపాస్ రోడ్డు



చినమామిడిపల్లి వద్ద నిర్మించిన బైపాస్ రోడ్డు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను ఆనుకుని చినమామిడిపల్లిలో నిర్మించిన బైపాస్ రోడ్డు కీలకంగా మారడమే కాకుండా సుమారు 40 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా అవతరించింది. చినమామిడిపల్లిలో రైల్వేగేటు సమస్య ఏడాదిన్నర క్రితం వరకూ వేధించేది. పలురైళ్ల రద్దీ కారణంగా పగటిపూట కూడా సుమారు 3 గంటలపాటు గేటు మూసేసేవారు. ఇంజిన్‌ల షంటింగ్ కారణంగా ఈ పరిస్థితి ఉండేది. అయితే రైల్వేశాఖ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో బైపాస్‌రోడ్డు నిర్మించి, గేటును శాశ్వతంగా మూసేశారు. దీంతో రైల్వేగేట్ సమస్యకు మోక్షం కలిగింది. దీంతో మత్స్యపురి మీదుగా నరసాపురం నుంచి భీమవరం ప్రయాణించేవారికి అనుకూలంగా ఉండటంతో ఈ రోడ్డులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రైల్వేగేటు సమస్య లేకపోవడంతో సుమారు 40 గ్రామాల వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటుగా ప్రయాణిస్తున్నారు. దశాబ్దాల నాటి రైల్వే గేటు సమస్య పరిష్కారమవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

నరసాపురం: ప్రేమలు, పెళ్లిళ్ల పేరుతో యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్రస్థాయి విజ్ఞాన శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలో రమాదేవి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలు యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టే కఠిన చట్టాలను అమల్లోకి తేవాలన్నారు. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. మహిళలు సమస్యలపై సంఘటితంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్.ఉదయకుమారి, బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న మందపాడు సీసీ రోడ్డు



మందపాడు–ఉప్పుటేరు రోడ్డు కుంగిపోతున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక ఉప్పుటేరు వంతెన దగ్గర నుంచి మందపాడు వరకూ ఉప్పుటేరు గట్టుపై వేసిన సీసీ రోడ్డు రెండుగా చీలిపోతుంది. సుమారు నాలుగేళ్ల క్రితం సీసీ రోడ్డును నిర్మించారు. సీసీ రోడ్డు మధ్య భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశం నుంచి రోడ్డు పంట పొలాల వైపుకు కుంగిపోయింది. ఇటీవల ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు విడిపోయిన భాగంలో తారు వేసి ప్యాచ్ వర్కు చేశారు. అయినప్పటికీ రోడ్డు విడిపోయింది. ఈ ప్రాంతం గుండా ప్రైవేటు గొడౌన్ల నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. వేసవి కాలంలో మట్టి ట్రాక్టర్లు, లారీలు భారీ లోడుతో తిరగడంతో రోడ్డు మరింతగా కుంగిపోయింది. సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోతే తాము ఈ ప్రాంతం గుండా ద్విచక్ర వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం ఉండదని, ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డు రెండుగా విడిపోకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


అందరి చూపు.. ఆచంట వైపు



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు (ఫైల్)

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జిల్లాలో అందరి చూపు ఆచంట నియోజకవర్గంపైనే కేంద్రీకృతమైంది. ఆచంట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టీడీపీ కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ పోటీ పడ్డారు. ఇద్దరి వ్యూహాలకు పదును పెడుతూ హోరాహోరీగా తలపడ్డారు. అన్ని వర్గాల మద్దతు, సంక్షేమ పథకాల బలంతో చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముందుకు దూసుకువెళ్లగా, సామాజికవర్గ బలం, కూటమి మద్దతుతో పితాని సత్యనారాయణ దీటుగా ముందుకు సాగారు. ఎవరికి వారే విజయంపై ధీమాతో ముందుకు సాగుతుండడంతో పందేలు సైతం జోరుగా సాగాయి. నియోజకవర్గంలో 1,80,017 మంది ఓటర్లలో 88,881 మంది పురుషులు, 91,132 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. 92.80 శాతం ఓటింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 88,881 ఓట్లకు గాను 73,024 మంది, మహిళలు 91,132 మందికి గాను 76,022 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్‌లో 1,317 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సరీవ్వసు ఓట్లు పెరిగితే మరిన్ని పోస్టల్ బ్యాలెట్‌లు పెరిగే అవకాశం ఉంది. మంగళవారం భీమవరంలోని సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ నాలుగు టేబుల్స్‌పై లెక్కించనున్నారు. ఈవీఎం లెక్కింపు 14 టేబుల్స్‌పై 14 రౌండ్స్‌లో లెక్కించనున్నారు. పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందలపర్రుతో లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆచంట మండలం అయోధ్యలంకలోని పుచ్చల్లంక పోలింగ్ కేంద్రంతో కౌంటింగ్ ముగుస్తుంది. కాగా, విజయంపై ఎవరి లెక్కలు వారే వేసుకుంటూ ఇరువర్గాలు ధీమా వ్యక్తం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. నియోజకవర్గంలో మహిళా ఓటింగ్ సరళి పెరగడంతో తమకే అనుకూలంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ దీమా వ్యక్తం చేస్తోంది.

మేఘాల విహారం.. గోదారికి హారం



చించినాడ వంతెన వద్ద వశిష్ట గోదావరి నదిపై ఆకాశంలో కనిపిస్తున్న వెండి మబ్బులు

నిన్నామొన్నటి వరకు వేసవి తాపంతో అల్లాడిన ప్రజలకు వాతావరణంలో వచ్చిన మార్పుతో ఉపశమనం కలిగించగా, ప్రకృతి సైతం పరవశించిందా అన్నట్లు ఆకాశంలో వెండి మబ్బులు దోబూచులాడుతున్నాయి. చించినాడ వద్ద వశిష్ట గోదావరి నది వద్ద ఆకాశంలో సోమవారం ఏర్పడిన వెండి మబ్బులు, కింద నీలి రంగులో గోదావరి నీరు దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి.

– యలమంచిలి